
# సెలవు

నేమలూరి భాస్కరరావు



మళ్లీ అరవై సంవత్సరాల తర్వాత, అంతగా పేట్రేగి మండుతోంది మిడిమేలపు ఎండ. వెధవ పొట్టకోసం 'విధి'కి తలవొగ్గి సాయంత్రం దాకా ఆఫీసులో మగ్గి ఆవిర్లు కక్కుతూ బయటపడ్డాను. గవర్నమెంటులా నడిచే సిటీ బస్సులో బాక్ డోర్లోంచి దూరి, గంపకోడిలా నలుగుతూ ఇల్లు చేరాను.

"ఇప్పటికి తెమిలిందా .... రండి! రండి! ఒక్క నిముషం మీరలా కూర్చుంటే కాఫీ కలిపి తెస్తాను!" అంటూ నా అర్థాంగి ముఖం నిండా చిర్నవ్వులు పులుంకుంటూ వంటింటి కేసి నడిచింది. ఎవరో స్త్రీవాద రచయిత్రి అన్నట్టు అప్పుడు మా ఆవిడే నడుస్తున్న వంటిల్లులా కనిపించింది నాకా క్షణంలో!

నాకు తెలుసు, విజయవాడ మహానగరపు మురుగునూ, ఎండనూ, విషాదాన్నీ, వాతావరణ కాలుష్యాన్నీ తనవంతుగా భరిస్తున్న గుబ్బంలాంటి మా అద్దెకొంపలో ఆవిడలా నిత్యం కట్టుబానిసలా కష్టపడుతోందని. ఏం చేస్తాం .... ముదనష్టపు మధ్యతరగతీయుణ్ణే, చిరుద్యోగినీ అవటం వల్ల ఆవిడకు సానుభూతి చూపించటం మినహా మరేమీ చెయ్యలేని చవటాయిని!

మా ఇంట్లో బోరు, రాష్ట్రప్రభుత్వ ఖజానాలా వట్టిపోయింది. నెల రోజులుగా చుక్క నీళ్లూ రావటంలేదు. ఇంటి యజమానికి ఫిర్యాదు చేస్తే ఆయన ముఖ్యమంత్రిలా చేతులెత్తేశాడు. పైగా సలహా ఇచ్చాడు కూడా .... జోలె పట్టుకుని ఐ.ఎం.ఎఫ్. రుణాల కోసం వెళ్లినట్టు, బిందె పట్టుకుని వీధి పంపులకు వెళ్లి ముందు పబ్బం గడుపుకుంటే ఆనక రాజెవరో, రెడ్డెవరో! ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ షాపులకు వరుసగా నాలుగుసార్లు లైసెన్స్‌లు కురిపిస్తే గవర్నమెంటు ఖజానా ఎలా కళకళ లాడుతుందో అలాగే నాలుగు వర్షాలు దబీదబీ బాత్తే బోరుబావులకు నీళ్లొస్తాయని కూడా అన్నాడు.

పోనీ ... ఇల్లు ఖాళీ చేసి అన్ని సౌకర్యాలూ ఉన్న మరో ఇల్లు చూసుకుందామా అంటే అంత సులువుగా ప్రత్యామ్నాయం లభించే అవకాశం లేదు. అన్నీ ముష్టి ఇళ్లే, మురికి కూపాలే! పైగా మరో సమస్య ఏమిటంటే ఉన్న ఫళంగా అలా ఇల్లు మారాలన్నా మధ్యంతర ఎన్నికల్లా విపరీతమైన శ్రమ, నిష్ప్రయోజనంగా ఖర్చు ...

అందుకే మాలాంటి వాళ్లంతా ఉన్న పొయ్యిలోనే వంకాయల్లా మగ్గుతూ; అలాగే సరిపెట్టుకుంటూ; బజారు పంపుల దగ్గర పితూరీలు లేవదీస్తూ; అడపాదడపా బాహాబాహీ ముష్టి నీళ్ల కోసం ముష్టియుద్ధాలు చేస్తూ ...

నేను సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చే అరగంట ముందే ఆవిడ వీధి పంపు ప్రహసనాలు ముగించుకుని, ఎలాగైతేనేం ఓ పది బిందెల నీళ్లు కూడబెట్టి ఫారిన్ టూర్ చేసి వచ్చిన మంత్రిలా అలసిపోయి కనిపించేది. సరిగ్గా నేనూ ఆఫీసు నుంచి ఇంటికి తగలడేది కూడా అదే వేళ! అయినా నన్ను చూడగానే ఆవిడ బలవంతంగా నవ్వేది. ఆ నవ్వులో కూడా ఎంత అలసటో!

నేను తాపీగా లుంగీ చుట్టుకొని మంచం మీద సొక్కిపోయి అలానే పడుకున్నాను. శ్రీమతి కాఫీ గ్లాసు తెచ్చి అందించి, మంచం మీద ఓ వారగా కూర్చుంది.

కాఫీ సిప్పులతో నేను సేదదీర్తుంటే, మా ఆవిడే చెప్పింది "మీ అక్కయ్యగారు ఉత్తరం రాశారు!" అని.

"ఏదీ ...?" అని అడిగేను.

ఆవిడ మౌనంగా లేచి వెళ్లి ఉత్తరం తెచ్చి నా చేతికి అందించింది. చదవటం ప్రారంభించాను

"తమ్ముడూ!

మన వసుంధరకు నాలుగైదు పెళ్లి సంబంధాలు చూశాము. వాటిలో ఏదో ఒకటి ఫైనల్ చెయ్యాలి. నువ్వు వెంటనే బయలుదేరి నాలుగు రోజులు ఇక్కడ ఉండేలా సెలవు పెట్టి వస్తే బావుంటుంది. సుభద్రను కూడా వెంట పెట్టుకుని రాగలవు. అన్ని విషయాలూ కలసి మాట్లాడుకుందాం!

మీ అక్కయ్య
సత్యవతి."

ఖాళీ అయిన కాఫీ గ్లాసునూ, చదివేసిన ఉత్తరాన్నీ సుభద్రకు యిచ్చేను.

"వసుంధరకు సంబంధాలు చూస్తున్నారట. ఫైనల్ చేసేందుకు మనల్ని రమ్మని రాసింది అక్కయ్య. రేపు రాత్రికి బయలుదేరుదాం. నాలుగు రోజులు అక్కడే ఉండాలి మనం!" అన్నాను ఆవిడతో.

సుభద్ర ముఖం వికసించింది! నాలుగురోజులైనా విజయవాడ ఎండలు, వీధి కుళాయిల దగ్గర యుద్ధాలు, నీళ్లు మొయ్యటాలూ తప్పుతాయన్నదే ఆమె ముఖంలో కనిపించిన కాంతికి కారణం కావచ్చు!

000

విజయవాడకు ఓ రెండొందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ లంక గ్రామంలో మా బావగారికి ఉద్యోగ విధి. జిల్లా పరిషత్తు స్కూల్లో అధ్యాపకుడాయన. అగ్గిపెట్టెంత ఆ లంక గ్రామంలో కూడా ఇటీవల చేపల సంస్కృతి అమితంగా పెరిగిపోయింది. ఊరి పొలాలు, ఖాళీ స్థలాలూ చేపల చెరువులుగా మారిపోయాయి. మా బావగారి ఇంటి చుట్టూ అన్నీ చేపల చెరువులే!

వేసవికాలంలో బావగారి ఇంటి బయట మంచాలు వేసుకుని పడుకుంటే చెరువుల మీంచి వచ్చే చల్లటి గాలికి ప్రాణం ఎటుపోతుందో. ఏ.సి. రూమ్‌లు కూడా అంత హాయిని కల్పించవు.

విజయవాడ రొటీన్ జీవితంతోనూ, వేసవి ఉగ్రతతోనూ అట్టే విసుగెత్తిన మాకు అక్కయ్య ఆహ్వానంతో వాళ్ల ఊరికి వెళ్లటం ఊటీ వెళ్లినట్టే దివ్యానుభూతి కలిగించింది.


000

పొద్దున్నే నేను ఆఫీసుకు వెడుతూ రాత్రి ఏడు గంటల బస్సులో ప్రయాణానికి అన్నీ సిద్ధం చెయ్యమని మా ఆవిడకు చెప్పాను. ఆఫీసుకు వెళ్లగానే నాలుగు రోజులు సెలవు మంజూరు చేయించుకున్నాను. సాయంత్రం ఐదు గంటలు కాగానే హడావుడిగా ఫైళ్లు మూసి బీరువాలో తోసి ఆఘమేఘాల మీద ఇంటికి వెళ్లాను.

అప్పటికే మా ఆవిడ ప్రయాణ సన్నాహాలన్నీ పూర్తి చేసింది. మా ప్రయాణం ముగిసి అక్కగారి ఊరు చేరుకునే సరికి రాత్రి పదకొండు గంటలవుతుంది కనుక ఉదర పోషణార్థం మినప రొట్టెలు కూడా కాల్చింది. ఇద్దరం కలిసి కడుపునిండా రొట్టెలు లాగించాం. బస్టాండుకు వెళ్లే వేళకు బస్సులో కూర్చున్నాం. బస్సు కిటికీల గుండా వీస్తున్న చల్లగాలికి విజయవాడ దాటీ దాటక ముందే నాకు కునుకుపట్టింది.

ఎప్పటికో మా బస్సు అక్కయ్యగారి లంక గ్రామంలో ఆగగానే మా ఆవిడ తట్టి లేపితే ఉలిక్కిపడి లేచాను. సూట్‌కేసు అందుకుని ఇద్దరం బస్సు దిగాం. అక్కయ్యగారి ఇంటికి వెళ్లాం.

మా కోసమే ఎదురు చూస్తున్నట్లు వాళ్లంతా మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలు, భోజనాలు అయ్యాయి. నా మేనకోడలు



వసుంధర వాకిట్లో వాల్చి, దుప్పట్లు పరిచిన మంచాల మీదకి చేరాము.

చల్లగాలికి అరక్షణం నిద్రపోగానే ఎలా తెల్లవారిందబ్బా!?

ఉదయం ఆరుగంటలకే మా అక్కయ్య పేపరు, కాఫీ కపులతో ఎదురుగా ప్రత్యక్షమైంది. పేపరు అందుకుని హెడ్‌లైన్స్ చదువుతూ కాఫీ ముగించాను.

అంత చిన్న కుగ్రామంలో కూడా ఆక్వా కల్చర్ మనుషుల జీవితాల్లో స్పీడును ఎంత స్పీడుగా ప్రవేశపెట్టిందో! రోడ్డు మీద హీరోహోండాలూ, టీవీఎస్‌లూ, మినీ ట్రక్కులూ పరుగులు పెడుతున్నాయి.

ఆ స్పీడు ఊరిదా? వ్యాపారానిదా? అన్న మీమాంస కలిగింది నాకు.

అక్కయ్యగారి ఊరలా వేగంగా మారిపోతున్నా ఇంటి దగ్గర లెట్రిన్ లేదు. ఊరివాళ్లంతా బహిర్భూమికి కాలువకట్టకు వెళ్తారు. అది కూడా ఊరికి చాలా దూరం.

కాలువకట్టకు అటూ ఇటూ ఇంతకుముందు సస్యశ్యామలంగా వరి పొలాలు ఉండేవి. పొలాలకు బదులుగా ఇప్పుడు చేపల చెరువులు దర్శనమిస్తున్నాయి. ఇళ్ల చుట్టూ అంతా చేపల చెరువుల మయమే అయినా గ్రామంలో తాగేందుకు మంచినీళ్లు దొరకవు. వాటి కోసం అందరూ ఊరి వెలుపలి కాలవను ఆశ్రయించాల్సిందే. ఊరి చెరువులన్నీ చేపల మేతతో కలుషితం కాగా ఊరికి కిలోమీటరు దూరంగా ఉన్న కాలువ నుంచి వాళ్లు మంచినీళ్లు తెచ్చుకుంటారు.

మధ్యాహ్న భోజనాలు ముగించాం. ఇంటిముందు తాటాకు పందిరి కింద కూర్చున్నాం.

అక్కయ్యే అంది "ఈ ఊళ్లన్నీ ఇలా అభివృద్ధి అవుతున్నట్లు పైకి కనిపిస్తున్నా, మనుషులు మాత్రం సుఖాన్ని కోల్పోతున్నారు. ఇంతకు ముందు ఇలాంటి కుగ్రామాల్లో లభించే సుఖశాంతులు ఇప్పుడు లేవు తమ్ముడూ...!"

అక్కయ్య మాటల్లో ఎంత ఆవేదన ధ్వనించిందో!

"కార్లు, హోండాలు, ట్రక్కులూ పిచ్చికుక్కల్లా తిరుగుతూ దుమ్మూ ధూళీ, కంపూ సమకూరుస్తున్నాయి తప్ప, మరేం లేదు!" అన్నారు మా బావగారు.

అక్కయ్య సామాజిక విషయాలను అంతటితో కట్టిపెట్టి అసలు విషయంలోకి వచ్చింది.

"తమ్ముడూ! రేపు లగ్నాల సీజన్లో వసుంధరకు పెళ్లి చెయ్యాలి. ఉత్తరంలో రాశాను కదా ... నాలుగు సంబంధాలు చూశాం. నిర్ణయంలో మీ బావగారికీ, నాకూ మధ్య శ్రుతి కుదరటంలేదు. వాటిలో ఏ సంబంధమైతే బాగుంటుందో కొంచెం నువ్వయినా ఆలోచించి చెప్పు!

"మొదటి సంబంధం కుర్రవాడు బాగానే ఉంటాడు. అతనికీ, మన వసూకూ ఈడూ జోడూ చక్కగానే కుదురుతుంది. గుడివాడ వాళ్లది. స్వంత ఇల్లుంది. కుర్రాడికున్న ఒకే ఒక్క అక్కకు పెళ్లయి కాపురానికి వెళ్లిపోయింది. తల్లీ, తండ్రీ ఉన్నారు. తండ్రిగారు టీచరు ఉద్యోగం చేసి రిటైరయ్యారు. పింఛను వస్తుంది. కుర్రాడు ఒక్కడే. డిగ్రీ చదివాడు. గుడివాడలోనే బట్టల దుకాణం పెట్టి వ్యాపారం చేస్తున్నాడు. నెలకు పదివేలదాకా ఆదాయమట. పెళ్లి చూపులకు వస్తామంటున్నారు.

ఇక రెండువ సంబంధం : వాళ్లది అవనిగడ్డ. కుర్రాడికింకా ఉద్యోగం లేదు. డిగ్రీ చదివాడు. బైపు కూడా ఏవో పరీక్షలు పాసయ్యాట్ట. ఒక్కడే అబ్బాయి. అమ్మాయిలు లేరు. తల్లీ, తండ్రీ ఉన్నారు. తండ్రి పౌరోహిత్యం చేస్తూంటాడు. ఇల్లు, రెండెకరాల పొలం ఉంది.

ఇక మూడవ సంబంధం : బందరు వాస్తవ్యులు. కుర్రాడు ఒక్కడే. అతని తర్వాత నలుగురు ఆడపిల్లలున్నారు. తండ్రి కాలం చేశాడు. తల్లి ఉంది. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యాలి. వాళ్ల మంచీ, చెడూ చూడాలి. అబ్బాయి అందంగా హీరోలా ఉంటాడు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్. ఆదాయం అమితంగా ఉంటుంది. స్వంత ఇల్లు కూడా ఉంది.

ఇక నాలుగో సంబంధం : భీమవరంవాళ్లు. కుర్రాడికి తల్లి తప్ప ఇంకెవరూ లేరు. ఆస్తిపాస్తులు, ఇల్లూ లేవు. అబ్బాయి మాత్రం ఆంధ్రాబ్యాంకులో మెసెంజర్‌గా పనిచేస్తున్నాడు. కొంచెం నలుపైనా కనుముక్కు తీరు బాగానే ఉంటుంది. టెన్త్ వరకూ చదివాడు. ప్రైవేటుగా ఇంటర్ చదువుతున్నాడు!" అని చెప్పి అక్కయ్య ఒక్క క్షణం ఆగింది.

అందరం అక్కయ్య చెప్తోంది శ్రద్ధగా వింటున్నాం బావగారు మాత్రం నిర్లిప్తంగా కనిపించారు.


అక్కయ్యే మళ్లీ అంది "చూడు, తమ్ముడూ! నాకు మాత్రం ఆ నాలుగు సంబంధాల్లోనూ చివరి సంబంధమే నచ్చింది. కానీ మీ బావగారికి అది సుతరామూ నచ్చలేదు. కుర్రాడు నల్లగా ఉంటాడనీ కనీసం డిగ్రీ కూడా చదవలేదనీ, మెసెంజర్ అంటే కలెక్టరు కాకుండా కేవలం ఒక బంట్రోతు మాత్రమే అనీ బావగారి అభ్యంతరాలు!"

"బందరు సంబంధం ఎందుకు నచ్చలేదు నీకు?" అని మధ్యలోనే అక్కయ్యను అడిగాను.

అక్కయ్య ఒక్క క్షణం మౌనం తర్వాత, "సంబంధం మంచిదే! అబ్బాయి మంచి ఉద్యోగంలో ఉన్నాడు. స్వంత ఇల్లుంది. కానీ నలుగురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యాలతను. వాళ్ల పురుళ్లూ, పుణ్యాలూ చూడాలి. ఇల్లూ, వాకిలీ అమ్మినా వాళ్ల పెళ్లిళ్లకు చాలక అప్పులపాలైనా ఆశ్చర్యం అనవసరం. ఒకవేళ అప్పుచేసి కార్యాలు గట్టెక్కించినా ఆ అప్పు తీరేలోగానే వాళ్లందరూ పురుళ్లకు పుట్టింటికి దిగుతారు. అతడి సంపాదన అవసరలాకే చాలదు. అదీ కాక, అత్తగారికి, అంతమంది ఆడబిడ్డలకీ చాకిరీ చెయ్యటం వసూతో అయ్యేపని కాదు!" అంది ఘంటాపథంగా.

బావగారి ముఖం చిట్లిపోవటం అప్పుడు గమనించాను నేను.

"తమ్ముడూ! ఇక రెండో సంబంధం విషయానికి వస్తే పౌరోహిత్యం జీవనాధారం అయిన కుటుంబంలో నా పిల్లను ఇవ్వనుగాక ఇవ్వను, అంతే! అతను డిగ్రీ పాసైనా ఇంకా ఉద్యోగం లేదు. ఇల్లూ, పొలం ఉన్నా, ఉద్యోగం ఉద్యోగమే కదా! రిజర్వేషన్ కోటాలు దాటి అతగాడికి భవిష్యత్తులో కూడా ఉద్యోగం వచ్చే ఆశ లేదు. కొంతకాలం అలా ఇంటర్వ్యూలకు తిరిగి తిరిగి, చివరికి విసుగెత్తి అతనూ తండ్రికి మల్లే పౌరోహిత్యం చెయ్యటం



జరిగేదే! అలా ఎంతమందిని చూళ్లేదూ ..." అంటూ తన లోకానుభవాన్ని చాటిచెబుతూ గర్వంగా నావైపు చూసింది అక్కయ్య.

"మరి గుడివాడ సంబంధమో?" అడిగాను.

"అదా ...! అంతా బాగానే ఉంది కానీ, అతడిది వ్యాపారం. వ్యాపారంలో ఓడలు బండ్లూ, బండ్లు ఓడలూ కావచ్చు. ఆర్థికంగా భద్రత లేని జీవితం అతనిది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేము. అలాంటప్పుడు నా కూతురు జీవితంతో ప్రయోగాలు ఎలా చెయ్యగలను?" అడిగింది అక్కయ్య.

అప్పటిదాకా ఎంతో అసహనంగా వింటూ కూర్చున్న మా బావగారు గయ్యిన లేచారు. "ఇదయ్యా ... మీ అక్కగారి ఫైనల్ జడ్జిమెంటు! కుర్రాడు అందగాడు కానవసరం లేదు. హోదాగల గవర్నమెంటు ఉద్యోగి కానవసరం లేదు. ఆస్తిపరుడు కాకున్నా ఫర్వాలేదు. కురూపి అయినా అభ్యంతరం లేదు. కానీ వాడికి మాత్రం వెనకా ముందూ ఎవ్వరూ లేకపోతే అంతే చాలు. బంట్రోతు ఉద్యోగమైనా భద్రతగలదైతే చాలు. అమ్మాయి ఇష్టాయిష్టాలతో మీ అక్కయ్యకు ఎంతమాత్రం సంబంధం లేదు. నా మాటమీద, అభిప్రాయంమీద, వివేచనమీదా ఆమెకు రవ్వంత నమ్మకం లేదు ..." అంటూ బావగారు చాలా ఇదిగా విసుక్కుంటుంటే, మా అక్కయ్య కిసుక్కున నవ్వింది.

అక్కయ్య తరహా నాకు తెలియందేముందీ ...! ఆమె తీరే అంత. అందరినీ తన అజమాయిషీలోకి రప్పించుకోవటం; లౌక్యంతో కూడిన కాస్తంత నిరంకుశత్వంతో అనుకున్నది అందరిచేతా ఒప్పించటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్యే! అలాగే ఇప్పుడు మా బావగారితో సహా అందర్నీ నియంత్రించబోతోంది.

నేనే గొంతు పెగల్చుకున్నాను. అక్కయ్య వైపు తిరిగి "బావగారు అన్నది కూడా నిజమేగా! పిల్లాడు పిల్లకి నచ్చాడో? లేదో? కనుక్కోవాల్సిన అవసరం మనకుందిగా!" అన్నాను సందేహంగా చూస్తూ.

బావగారికి నా మాటలతో కొంత ఊరట చిక్కిందన్న విషయం ఆయన ముఖంలో గమనించాను.

అక్కయ్యకు ఏం గుర్తొచ్చిందో కానీ, కూతురు వైపు చూస్తూ, "వసూ! నువ్వు కొంచెం అలా బయటికి వెళ్లు, మేము వేరే విషయాలు మాట్లాడాలి!" అంది.

వసుంధర అక్కడ నుంచి వెళ్లిపోయింగి.

"తమ్ముడూ! ఇప్పుడు చెప్తాను విను. మొదట్లో బంట్రోతు సంబంధానికి అమ్మాయి కూడా అంగీకరించలేదు. వాళ్ల నాన్నే నూరిపోశారేమో .... అబ్బాయి నలుపని, ఆస్తిపాస్తులు లేవని, పైగా చేసేది బంట్రోతు పని అనీ ... మీ బావగారు అవన్నీ అబ్బాయికి మైనస్ పాయింట్లని భావించారు గానీ, నాకు మాత్రం అవన్నీ ప్లస్ పాయింట్లు!"

ఆశ్చర్యంగా చూశాను.

"ఎలాగంటే, కుర్రాడికి తల్లి బాధ్యత తప్ప వేరే బాధ్యత లేదు. ఆస్తిపాస్తులు లేనివాడు కనుక కష్టపడి బతికే స్వభావం ఉండి తీరుతుంది. అందుకే అతను బంట్రోతు ఉద్యోగమే అయినా ఆనందంగా చేస్తున్నాడు. కష్టపడి చదువుతున్నాడు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తే, రేపో, మాపో ప్రమోషన్ సాధిస్తాడు. పైగా, మనం విస్మరించకూడని మరో అంశం ఉందిక్కడ! మన అమ్మాయి స్వభావం మనకు తెలుసు కదా ... గారాబంగా పెరిగిన పిల్ల అది. పువ్వులా పెంచాం కనుక సోమరితనం కూడా అబ్బింది దానికి. దానికితోడు పెంకితనం, మాటదురుసూ! అందరిమీదా దాష్టీకం చెలాయించే మనస్తత్వం ఉన్న వసుంధరకు సహనం, ఓర్పూ గల భర్త అయితేనే సంసారం సజావుగా సాగుతుంది. లేకుంటే నరకమే. కుర్రాడు అంత చిరు ఉద్యోగం చేస్తున్నాడు కనుక అణకువ, సహనం, ఓర్పు ఉంటాయి. ఒకవేళ అమ్మాయి మాట తూలినా సర్దుకునిపోయే గుణం అతడినుంచి ఆశించవచ్చు. అన్ని విషయాలూ అమ్మాయికి చెప్పాను!" అని అక్కయ్య అమాంతం నా వైపు తిరిగి

"తమ్ముడూ! మీ బావగారేం మన్మథుడా? ఎలాగో సర్దుకుపోయి, అటుపై అలవాటుపడి క్రమంగా ఆయన్నే ఆరాధించటంలేదూ నేను? ఎవరైనా అంతే! మన ఊహలు తెచ్చిపెట్టే సమస్యలు కొన్నింటిని మన జీవితమే పరిష్కరిస్తుంది!" అంది చాలా తాత్త్వికంగా.

అక్కయ్య తార్కిక శక్తికీ, విశ్లేషణకూ, ... పటిమకూ మేమందరం డంగైపో...

బావగారు కూడా పూర్తిగా కన్విన్స్‌య్యారల్లే ఉంది. చాలాసేపటి తర్వాత ప్రసన్నంగా అక్కయ్య కళ్లల్లోకి చూశారు.

అక్కయ్య తన అభీష్టాన్ని మా అందరి అభీష్టంగా మార్చింది. ఆమె ఆది నుంచీ లాభనష్టాల గీటురాయితో తప్ప విషయాలను విశ్లేషించదు. విలువల విషయం అసలు పట్టించుకోదు. ఆ విధానం నాకు సమ్మతం కాకపోయినా ఆమె ముందు వాదనలో ఎన్నిసార్లు ఓడిపోయానో!

ఇప్పుడూ అలానే జరిగింది.

"నిజమేనోయ్, నువ్వు చెప్పింది! ఇంతకాలం నేను వచ్చే సంబంధాల స్థితిగతుల గురించే ఆలోచించాను కానీ, మన అమ్మాయి మనస్తత్వం గురించి ఆలోచించలేదు. దాని బలహీనతలను దృష్టిలో ఉంచుకుంటే దానికి నువ్వు నిర్ణయించిన కుర్రాడే సరైన జోడీ!" అంటూ మా బావగారు వెంటనే తన అభిప్రాయాన్ని పాతర వేసి అక్కయ్యతో ఏకీభవించారు.

బంట్రోతు సంబంధం ఖాయమైంది.

నేనూ, నా భార్యా ఆ నాలుగు రోజులూ అక్కడ గడిపి విధి లేక విజయవాడ అగ్నిగుండానికి చేరుకున్నాం.

ఆ రాత్రి మా ఆవిడ నాతో అంది "ఏమండీ! మీ అక్కయ్య జ్ఞానానికి నా జోహార్లు! మెసెంజరు అల్లుడు పై అధికారులకు అణగిమణిగి ఉంటూ అలాంటి ప్రవృత్తికే అలవాటు పడతాడని ఎంచక్కా అంచనా వేసిందో ఆవిడ. ఆమె అన్నదీ నిజమే! అలాంటి వాడైతేనే తప్ప వసుంధరతో వేగలేడు. మీలాంటి వాళ్లంతా పైపై పటాటోపాలనూ, హోదాలనూ, ఆస్తులూ, ఆదాయాలనూ చూస్తారు కానీ, మనస్తత్వాల దాకా లోపలకు వెళ్లరు!" అంది తల పంకిస్తూ.

జీవితం కూడా వ్యాపారపు సరుకుగా మారినప్పుడు మా బావగారిలా అభిప్రాయాలను అరక్షణంలో, అటూ ఇటూ మార్చుకోగలిగితే ఆనందం దూరం కాదు. నాకు మాత్రం కొంచెం ఇబ్బందిగానే ఉంది! వ్యాపారాత్మక దృక్పథం లేనివాళ్లకు అలాంటి అంతర్మథనం అనివార్యం కామోసు!

